క్లుప్తంగా

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



తాడూరు: మండలంలోని అల్లాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు దాత శ్రీనివాస్‌రెడ్డిని అందజేసిన నోట్ పుస్తకాలను బుధవారం హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం దాతను అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



వెల్దండ: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని హెచ్‌ఎం సుగుణ పేర్కొన్నారు. బుధవారం బడిబాటలో భాగంగా ఇంటింట తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా భోజనం, దుస్తులు, పాఠ్యపుస్తకాలు అందిస్తుందన్నారు. అనంతరం బాలికల ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు దుస్తులు, పాఠ్యపుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయ, లావణ్య, హరిత, వాసుదేవ్, లక్ష్మీసుహాసిని తదితరులు ఉన్నారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ



లింగాల: మండలంలోని కోమటికుంటలో బుధవారం గామా ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ మండల కో ఆర్డినేటర్ గుడి శ్రీనివాసులు మాట్లాడుతూ తెల్ల రేషన్‌కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరు సంస్థలో సభ్యత్వం పొందితే అనేక ప్రయోజనాలు ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ దుర్గప్రసాద్, ఎత్తపు ఆనందరావు, కొండల్, చిన్నారెడ్డి, నిరంజన్, మల్లేష్, రాజు, విమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

బల్మూర్ ఇన్‌చార్జ్ ఎస్‌ఐగా ఇందిర


బల్మూర్: ఇన్‌చార్జ్ ఎస్‌ఐగా సి.ఇందిర బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ బాల్‌రాజ్ ఈ నెల 6వ తేది నుంచి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. ఈగలపెంట ఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్న ఇందిరకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. శాంతిభద్రతల విషయంలో పోలీసులకు సహకరించాలని కోరారు.

రైస్ మిల్లులో తనిఖీలు



కల్వకుర్తిరూరల్: మండలంలోని తంజూపూర్ రైస్ మిల్లులో రేషన్‌బియ్యం అక్రమంగా నిల్వ చేశారని సమాచారం మేరకు ఎస్‌ఐ మాధవరెడ్డి రైస్ మిల్లు కు చేరుకొని విచారణ చేశారు. ఓ వాహనంలో బియ్యం ఉండటాన్ని గుర్తించారు. ఈ విషయాన్ని సివిల్ సప్లై అధికారులకు సమాచారం ఇవ్వడంతో గురువారం తనిఖీలకు చేస్తామని చెప్పడంతో వాహనానికి తాళం వేసి వెళ్లారు.

మంత్రులను కేటాయించాలి



నాగర్‌కర్నూల్ రూరల్: విద్యా, హోం శాఖలకు మంత్రులను కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానికంగా ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో హోంశాఖ మంత్రి లేకపోవడంతో శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయన్నారు. లాఅండ్‌ఆర్డర్ విఫలం అయ్యిందని ఆరోపించారు. మహిళలకు, మైనర్ బాలికలకు రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. పాఠశాలలు ప్రారంభమై వారం రోజులు కావొస్తున్నా పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేయడంలో ప్రభుత్వం విఫలం అయ్యిందన్నారు. సమావేశంలో సంఘం నాయకులు నిరంజన్‌యాదవ్, కోట్ల శ్రీనివాసులు, సుధాకర్‌గౌడ్, ఈశ్వర్, గౌతమ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు వేతన వెతలు

- పంచాయతీ సిబ్బందికి జీతాలు అందక ఇబ్బందులు



డ్రెయినేజీలను శుభ్రం చేస్తున్న కార్మికులు



కంటోనిపల్లిలో చెత్తను ఎత్తుతున్న పంచాయతీ కార్మికులు

వెల్దండ: గ్రామాల్లో సర్పంచుల పదవీకాలం ముగిసిపోవడంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. ప్రత్యేక పాలనలో కార్మికులకు వేతనాలు అందక నానా అవస్థలు పడుతున్నారు. గ్రామంలో పారిశుద్ధ్యం లోపించకుండా నిత్య పని చేసే కార్మికులకు జీతాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. పంచాయతీలకు నిధులు విడుదల కాకపోవడంతో అధికారులకు ఇబ్బందులు తప్పడం లేదు. పంచాయతీల ఖాతాలు ఖాళీగా ఉండడంతో కనీసం వీధిలైట్లు, బోరుమోటర్ల మరమ్మతు, ట్రాక్టర్‌కు డీజిల్ కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొంది. గ్రామ పంచాయతీ కార్మికులకు నెలల తరబడి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. మండలంలోని 32 గ్రామ పంచాయతీలల్లో మొత్తం 106 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.9,500 వేతనాలు చెల్లిస్తున్నారు. కొని నెలలుగా జీతాలు పెండింగ్‌లో ఉండడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆరు నెలలుగా జీతాలు అందక..

మండలంలోని కార్మికులకు ప్రతి నెల వేతనాలను చెల్లించేందుకు కనీసం రూ.10.7 లక్షలు, అదే విధంగా ట్రాక్టర్ డీజిల్, వీధిలైట్లు కోసం దాదాపుగా మరో రూ.10 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. ఆరు నెలల నుంచి నిధులు మంజూరు కాకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని గ్రామ పంచాయతీలల్లో ఇంటి పన్నులు, ఇతర టాక్సీలు వసూలు చేసి రెండు నెలల వరకు జీతాలు చెల్లించారు.

నిధులు లేక..

2022 ఆగష్టు నుంచి ఎస్‌ఎఫ్‌సీ నిధులు మంజూరు కావడంలేదు. గ్రామ జనాభాకు అనుగుణంగా ఒక్కొక్కరికి రూ.812 చొప్పున 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేస్తుంది. గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలనలో దాదాపుగా 6 నెలలుగా నిధులు మంజూరు కాకపోవడంతో పారిశుద్ధ్యం, డ్రెయినేజీల్లో పూడికతీత, విద్యుత్ లైట్ల ఏర్పాట్లు, తాగునీరు పైపులైన్ మరమ్మతు, బోరుమోటర్ల మరమ్మతు పనులు చేయించేందుకు కార్యదర్శులకు, ప్రత్యేక అధికారులకు భారంగా మారింది.

పనిచేయించలేని పరిస్థితి

గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రతి నెల వేతనాలు అందించడం కష్టంగా మారింది. దీంతో సిబ్బందితో అధికారులు సక్రమంగా పనిచేయించలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం నుంచి సకాలంలో నిధులు మంజూరు కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా తాగునీరు సక్రమంగా అందక గ్రామాల్లో ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఉన్నత అధికారులు స్పందించి పంచాయతీలకు నిధులను సకాలంలో చెల్లించి ప్రజల ఇబ్బందులను తీర్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నాలుగు నెలలుగా జీతాలు లేవు



నాలుగు నెలల నుంచి జీతాలు ఇస్తలేరు. ప్రతి రోజు వీధులను శుభ్రం చేయడం, డ్రెయినేజీల్లో చెత్తచెదారం తొలగిస్తున్నాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైతేనే జీతాలు ఇస్తామంటున్నారు. డబ్బులు లేక కుటుంబ పోషణ భారంగా మారింది. జిల్లా అధికారులు సకాలంలో వేతనాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి.

– నీలమ్మ, పంచాయతీ కార్మికురాలు, వెల్దండ

త్వరలో నిధులు మంజూరు..



నిధుల మంజూరుకు జిల్లా అధికారులకు నివేదికలను అందించాం. త్వరలోనే నిధులు మంజూరు అవుతాయి. మంజూరైన వెంటనే పెండింగ్‌లో ఉన్న వారందరికి వేతనాలు అందిస్తాం. కొన్ని గ్రామాల్లో ఇంటిపన్నులు వసూలు చేసి కార్మికులకు వేతనాలను అందిస్తున్నాం. కార్మికులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– సునీత, ఎంపీఓ, వెల్దండ

చిన్నారులకు విద్యపై ఆసక్తి పెంచాలి

అచ్చంపేట: చిన్నారులకు విద్యపై ఆసక్తి పెంచాలని అంగన్‌వాడీ టీచర్లకు ఎమ్మెల్యే వంశీకృష్ణ సూచించారు. బుధవారం అచ్చంపేట బాలసదన్‌లో కరికులం ఫర్ ప్రిప్రైమరీ స్కూల్‌పై అంగన్‌వాడీ టీచర్లు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారులకు ఆనంద నిలయాలుగా మార్చాలన్నారు. ఇంతకు ముందు ఉన్న ప్రీస్కూల్ ప్రణాళిక మార్పులు చేసి పిల్లలకు సులభతరంగా అర్థమయ్యే విధంగా, అనువైన పద్ధతిలో బోధించేందుకు ప్రియదర్శిని ప్రణాళిక రూపొందించారన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యను బోధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రిస్కూల్ తీసుకొచ్చిందన్నారు. పిల్లలకు అర్థమయ్యే విధంగా తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో బోధన చేయాలన్నారు. కిశోర బాలికలతో పాటు గర్భిణులు, బాలింతలకు సకాలంలో పౌష్టికాహారం అందించాలని కోరారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లకు ప్రియదర్శిని పాఠ్యాప్రణాళిక పుస్తకాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీడీపీఓ దమయంతి, ఏసీడీపీఓ కమల, పోషణ అభియాన్ పతినిధి ప్రదీప్, కౌన్సిలర్లు గౌరిశంకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎ.గోపాల్‌రెడ్డి, జి.రాజేందర్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



ప్రియదర్శిని పాఠ్యా ప్రణాళిక పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

పంచాయతీ కార్మికుల ఆందోళన

కల్వకుర్తిరూరల్: పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు బుధవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులకు చెల్లించాల్సిన పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలన్నారు. కార్మికులను క్రమబద్ధీకరించి రూ.26 వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. నాలుగు నెలలుగా వేతనాలు రాకపోవడంతో వారి కుటుంబపోషణ మారిందని వాపోయారు. అనంతరం డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ వెంకటరాములుకు అందజేశారు. కార్యక్రమంలో మహేష్, శంకర్, మైసమ్మ, అర్జున్, బక్కయ్య తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న ఆంజనేయులు

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు

అచ్చంపేట: పట్టణంలోని రాజీవ్ చౌరస్తాలో బుధవారం రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రజాస్వామ్యం హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న యువ నేత రాహుల్ గాంధీ అని కొనియాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గౌరిశంకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎ.గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రామనాథం, జి.రాజేందర్, కటకం రఘురాం, కుంద మల్లికార్జున్, శరణ్‌గౌడ్, కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వెల్దండ: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా నాయకులు కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోతిలాల్ నాయక్, మాజీ సర్పంచ్‌లు భూపతిరెడ్డి, రామచంద్రయ్య, సింగిల్‌విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడు, నాయకులు పర్వత్‌రెడ్డి, శేఖర్, పుల్లయ్య, శ్రీనివాస్‌యాదవ్, ఎర్రశ్రీను, కృష్ణముదిరాజ్, రమేష్, పంతునాయక్, తిరుపతిరెడ్డి, నాగేష్‌గౌడు తదితరులు ఉన్నారు.



వెల్దండలో కేక్ కట్ చేస్తున్న మండల అధ్యక్షుడు మోతిలాల్

తాడూరు: మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి వినోద్ ఆధ్వర్యంలో స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు అన్వర్, చంటి, రాములు, రామస్వామి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగు నివారణపై అవగాహన ర్యాలీ

తెలకపల్లి: మండలంలోని ఆలేరు, బొప్పల్లి గ్రామాల్లో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా బుధవారం ఆయా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్య సిబ్బంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. అనంతర ఆయా పాఠశాల హెచ్‌ఎంలు మాట్లాడుతూ విద్యాభ్యాస సమయంలో విద్యార్థులు పరిశుభ్రత పాటించాలని, వ్యక్తి పరిశుభ్రత, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు. కలుషిత ఆహారం, కలుషిత పదార్థాలను తీసుకోవడం వల్ల శరీరంలో నులిపురుగులు, ఎలికపాములు తయారవుతాయని వివరించారు. శరీరంలో నులి పురుగులు ఉండడం వల్ల విద్యార్థుల్లో ఏకాగ్రత, మానసిక శారీరక పెరుగుదల, చురుకుదనం మందగిస్తుందని తెలిపారు. మండలంలో అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో ఆల్బెండజోల్ మాత్రలు ఈ నెల 20వ తేదీవరకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. హెచ్‌ఎంలు నరహరి, సత్యం, బాలయ్య, మణికంఠ, కవిత, రవి, శ్రీనివాసులు, ఆశాకార్యకర్తలు, సునీత, సంతోష తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

'నీట్' రద్దు కోసం సంతకాల సేకరణ



అచ్చంపేట రూరల్: నీట్‌ను రద్దు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని ఎస్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సంతోష్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో విద్యార్థులతో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. పరీక్షను మళ్లీ నిర్వహించే వరకు పోరాటం చేస్తామన్నారు. పేపర్ లీకేజీకి కారణమైన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలన్నారు. లడ్డుయాదవ్, వినోద్, సోహెల్, రాజేందర్, అన్వేష్, ఈశ్వర్ లాల్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



వెల్దండ: మండల కేంద్రంలో అనారోగ్యంతో మృతి చెందిన పాండు కుటుంబాన్ని బుధవారం కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్‌ముదిరాజ్ రూ.3 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణముదిరాజ్, మట్ట నాగేష్‌గౌడు, పుల్లయ్య, హమీద్, రమేష్, మల్లయ్య, శేఖర్ తదితరులు ఉన్నారు.

కల్వకుర్తిరూరల్: మండలంలోని కుర్మిద్ద గ్రామానికి చెందిన పార్వతమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. బీజేపీ గ్రామ నాయకుడు కృష్ణారెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో బాలరాజుగౌడ్, సైదులుగౌడ్, సాయిలు, బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా అందించాలి

పాన్‌గల్: విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం నాణ్యతగా అందించాలని ఎంపీడీఓ కోటేశ్వర్, ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని మాధరావుపల్లి ప్రాథమిక పాఠశాలను వారు సందర్శించి ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు శాతం, విద్యార్థుల సామర్థ్యాలు, మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. ప్రభుత్వం విద్యార్థులకు కలిస్తున్న వసతులను వివరిస్తూ విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఆదేశించారు. ప్రతి నిత్యం భోజనం నాణ్యతను పరిశీలించాలని హెచ్‌ఎంకు సూచించారు. హెచ్‌ఎం వీరస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో నిధుల వినియోగంపై ఆడిట్

పాన్‌గల్: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 2023–24 సంవత్సరంలో వచ్చిన నిధులు, ఖర్చు చేసిన విధానంపై బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఆడిట్ నిర్వహించినట్లు ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ తెలిపారు. ఆయా పాఠశాలలకు వచ్చిన నిధులతో ఖర్చు చేసిన విధానానికి సంబంధించిన అన్ని రకాల బిల్లులో ఆయా పాఠశాలలు ఆడిట్ చేయించుకోవాలన్నారు. ఇప్పటి వరకు 20 పాఠశాలలకు సంబంధించిన ఆడిట్ పూర్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యాలయం సిబ్బంది శేఖర్‌నాయక్, మూర్తి పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో..

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల పరిషత్ నిధుల ద్వారా వివిధ గ్రామాల్లో 2023–24 సంవత్సరంలో ఖర్చు చేసిన విధానానికి సంబంధించి బుధవారం ఎంబీ రికార్డులను ఆడిట్ అధికారులు పరిశీలించారు. మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో ఎంబీ రికార్డులను తనిఖీ చేస్తున్నారు.

వైభవంగా బోనాల పండుగ

చారకొండ: మండలంలోని జూపల్లిలో గ్రామ దేవత కోటమైసమ్మ పండగ సందర్భంగా బుధవారం భక్తి శ్రద్ధలతో బోనాల పండుగ నిర్వహించారు. మహిళలు ఊరేగింపుగా తరలి బొడ్రాయి ప్రదక్షణలు చేసి, బోనాలను కోటమైసమ్మ ఆలయాని చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. అంతకుముందు ఉదయం గ్రామ దేవతకు శక్తి పూజలు, బొడ్రాయి జలాభిషేకాలు చేశారు. నవధాన్యాలను సమర్పించారు. వెల్దండ సీఎస్‌ఎస్ చైర్మన్ జూపల్లి భాస్కర్ రావు, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, డీసీసీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటయ్య యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. యువకులు డీజే సౌండ్స్, బతుకమ్మ ఆటపాటలతో అలరించారు. ముస్తాఫా, బాల్‌రాజు, బాలేమియా, జగపతి, తిరుపతయ్య, బిక్షపతి, శ్రీనివాస్ గౌడ్, వెంకట్ గౌడ్, గోపాల్, సిరాజ్, రాంచంద్రి, కొండల్ గౌడ్, రామస్వామి, శ్రీరాములు యువకులు, మహిళలు తదితరులు ఉన్నారు.



స్వాగతం పలుకుతున్న నాయకులు

హైందవ సంస్కృతిని కాపాడుకుందాం

కల్వకుర్తిరూరల్: హైందవ సంస్కృతిని కాపాడుకుందామని శివాజీ సేవాసమితి అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, విశ్వహిందూ పరిషత్ నాయకుడు రాముప్రసాద్‌లు అన్నారు. బుధవారం పట్టణంలోని శివాజీ చౌరస్తాలో హిందూసామ్రాజ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా కాషాయ ధ్వజాన్ని ఎగురవేశారు. అనంతరం వారు మాట్లాడుతూ చత్రపతి శివాజీ పట్టాభిషేకం చేసిన రోజును హిందూసామ్రాజ్య దినోత్సవంగా జరుపుకుంటామన్నారు. వివేకానంద, నరేష్‌గౌడ్, నర్సింహ, రాఘవేందర్, సురేష్‌గౌడ్, గణేష్, మహేశ్వర్‌రెడ్డి, రాజుకుమార్ తదితరులు పాల్గొన్నారు.



కాషాయధ్వజాన్ని ఎగురవేస్తున్న నాయకులు

పౌష్టికాహారం లోపంతోనే రక్త హీనత



కల్వకుర్తిలో మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకట్‌రాములు



మన్ననూరులో..

కల్వకుర్తిరూరల్: ప్రజలకు రక్తహీనతపై అవగాహన పెంచాలని ఎంపీడీఓ వెంకట్‌రాములు సూచించారు. బుధవారం మండలం ఎల్లికట్ట గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో రక్తహీనతపై చేపట్టిన అవగాహన సదస్సును ఎంపీడీఓ ప్రారంభించారు. అనంతరం గ్రామంలో పర్యటించి సమస్యలపై ఆరాతీశారు. రికార్డులను తనిఖీ చేశారు. మొక్కలు నాటేందుకు తీసిన గుంతలను పరిశీలించారు.

మన్ననూర్: పౌష్టికాహారం లోపంతోనే రక్త హీనత వస్తుందని పీటీజీ పాఠశాల ప్రిన్సిపాల్ నిమ్మల పద్మావతి అన్నారు. బుధవారం పీటీజీ పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు ప్రపంచ సికెల్ సెల్ వ్యాధి నివారణకు (రక్తహీనత) తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఫ్ల కార్డులను ప్రదర్శిస్తూ గ్రామ ప్రధాన కూడళ్లలో ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు పీటీజీ పాఠశాల ఆవరణలో వైద్యాధికారులు సుధాకర్, జాన్సన్‌లతో పాటు వైద్య సిబ్బంది సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పౌష్టికాహారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది గీత, రాజేశ్వరి, ఉసేనమ్మ, ప్రసంగి, బాలస్వామి, మహేష్, శ్రీనివాస్, మదన్ మోహన్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పాఠశాల వసతులపై కలెక్టర్‌కు వినతి

బిజినేపల్లి: తిమ్మాజిపేట మండలంలోని భవాజిపల్లి ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలలో తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని బుధవారం కలెక్టర్ సంతోష్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలో దాదాపు 100 మంది విద్యార్థులు ఉన్నారని, అదనపు ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. మౌలిక వసతులకు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, కమిటీ సభ్యులు మంగ శేఖర్, సుధాకర్‌గౌడ్, సరితారెడ్డి, శేఖర్‌రఎడ్డి వెంకటస్వామి, రామకృష్ణ, మెహెరాజ్ తదితరులు ఉన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న భవాజిపల్లి పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని కల్వకుర్తి పట్టణానికి చెందిన మల్లికార్జున్ బుధవారం కలెక్టర్ సంతోష్‌కు, డీఈఓకు ఫిర్యాదు చేశారు. మల్లికార్జున్ కుమార్తె అనూష ఇటీవల నీట్ పరీక్షలు రాసి 526 మార్కులతో 225 ర్యాంకు సాధించింది. అనూష సంబంధించిన బోనాఫైడ్ కోసం విద్యార్థిని తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లగా 2014, 15 సంవత్సరంలో రూ.5700 ఫీజు కట్టలేదని ఆ ఫీజు మొత్తం చెల్లిస్తే బోనాఫైడ్ ఇస్తామని యాజమాన్యం తెలిపింది. దీంతో అనూష తండ్రి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

అధిక ధరలకు పాఠ్యపుస్తకాలు అమ్మొద్దు



అచ్చంపేట రూరల్: ఎలాంటి అనుమతులు లేకుండా ఓ ప్రైవేటు పాఠశాలకు చెందినే ప్రింటింగ్‌తో కూడిన పాఠ్య పుస్తకాలు అమ్ముతున్న అద్దె ఇంటి గదిని అచ్చంపేట ఎంఈఓ రామారావు సీజ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పట్టణంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌కు చెందిన పాఠ్యపుస్తకాలు, బెల్టులు, టై, డ్రెస్ మెటీరియల్‌ను రహస్యంగా ఓ అద్దె ఇంటిలోని గదిలో ఉంచి విక్రయిస్తున్నారు. బుధవారం ఏబీవీపీ విద్యార్థి సంఘం నాయకులు గుర్తించి ఎంఈఓకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి చేరుకొని ఎంఈఓ నిర్వాహకుల వద్ద ఉన్న పత్రాలను పరిశీలించారు. పత్రాలు సరిగ్గా లేకపోవడంతో గదిని సీజ్ చేశారు.

గుంతల రోడ్డుతో అవస్థలు



పెద్దకొత్తపల్లి: మండలంలోని సాతాపూర్ నుంచి మారేడుమాన్‌దిన్నె వెళ్లే బీటీ రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. మారేడుమాన్ దిన్నె, చంద్రబండతండా, సాతాపూర్, యాపట్ల గ్రామాల ప్రజలు రోడ్డు పై ప్రయాణించేందుకు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకోని సమస్య పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.